# ఉదర పోషణార్థం...

వేమూరి సుబ్రహ్మణ్యం

తేట తెలుగుకథ ఎలావుంటుందో ఒక మచ్చుతునక. ఈ కథలో ఇతివృత్తం వ్యవహారజగత్తు! వ్యవహారానికి, వాస్తవికతకి ఎంత దూరమో, ఎంత సాన్నిహిత్యమో - ఇందులో దుర్గయ్య తన కొడుక్కి చేసిన హితోపదేశం చదవండి.

పదో నెంబరు సిటీబస్సు యూనివర్శిటీ దగ్గిర ఆగింది. అది అంతటితో సరి. మళ్ళీ తిరిగి వెనక్కి పోతుంది. ఉదయం ఎనిమిది గంటలవుతోంది. అందుచేతనే అందులోంచి ఎక్కువమంది దిగలేదు. దిగినవాళ్లలో, ఇద్దరు విద్యార్థులు అక్కడే ఉన్న కాఫీ హోటలులోకి వెళ్లారు. ఇంకో ఇద్దరు విద్యార్థులు 'కాంటీన్‌లో కాఫీ తాగుదాం లేరా' అనుకొంటూ గేటులోంచి లోపలికెళ్లారు. ఒక విద్యార్థినిమటుకు చకచకా అందరికంటె ముందుగానే గేటులోంచి వెళ్లింది. ఇక మిగిలిన ఒక నడివయస్కుడు అటు యూనివర్శిటీలోకి కాకుండా, ఇటు కాఫీహోటలులోకి కాక సరాసరి బయలుదేరాడు. రెండు ఫర్లాంగులునడిచి ఒక కొత్తగా కట్టిన మేడ ముందు నిలబడి "దుర్గయ్యగారూ" అని కేకవేశాడు.

లోపలినుంచి ఒక ఆరేళ్ళ పిల్ల బయటికొచ్చి "నాన్నగారు జపంచేసుకొంటున్నారు. కూర్చోండి" అని చెప్పి లోపలికెళ్లింది. ఆయన వరండాలో ఉన్న నాలుగు కుర్చీల్లో ఒకదాంట్లో కూర్చున్నాడు. వరండాలోంచి ఎదురుగా సముద్రం కనబడుతోంది. అప్పుడు ఒకటి రెండు పడవలు సముద్రంలోకి బయలుదేరినయ్. 'దుర్గయ్యగారు ఊరికి దూరమయినా చక్కటి చోటు చూసి మరీ ఇల్లు కట్టుకొన్నారు. పొద్దున లేవగానే మునిసిపాలిటీలారీలు, సిటీబస్సులు కాకుండా ప్రశాంతంగావున్న సముద్రం, సూర్యోదయం కనిపిస్తుంది. సిటీగా మారిపోతున్న యీ విశాఖపట్నంలో ఇంతకంటే ఏం కావాలి?' అని మనస్సులో అనుకొన్నాడు. ఇంతలో డాబాముందున్న మొక్కలమీద ఆయన కళ్లు పడినయ్. మెల్లిగా కుర్చీలోంచి లేచి ఒక్కొక్క మొక్కనే చూస్తూ మెల్లిగా తిరుగుతున్నాడు.

ఇంతలో దుర్గయ్యగారు లోపలినుంచి వచ్చాడు. వస్తూనే "నమస్కారం కోదండ రామయ్యగారూ! ఎంత సేపయింది వచ్చి?" అన్నాడు. దుర్గయ్య ఎర్రగా, బొద్దుగా పొట్టిగా బట్టతలతో పదిమందిలో వున్నా ఓ ప్రత్యేకమైనమనిషిగా కనబడేటట్టుంటాడు.

కోదండరామయ్య పూలమొక్కల పరీక్ష మానేసి వరండాలోకొచ్చాడు. కుర్చీలో కూర్చున్నాడు. "చక్కగా ఇంటిముందు ఓ చిన్నతోట పెంచుతున్నారే. బాగుందండి. ఎదురుగా సముద్రం, పట్నంలో వున్న గోల అదీ ఉండదు. ప్రశాంతంగా ఉంటుంది" అన్నాడాయన.

"ఏదోనండి, చవకగా వచ్చిందని స్థలం కొని ఇల్లు కట్టాను. అదీ కాక అబ్బాయి, అమ్మాయి యూనివర్శిటీలోనే చదువుతున్నారు కదండీ. వాళ్లకూ దగ్గిరగా వుంటుంది" అన్నాడు దుర్గయ్య కుర్చీలో కూర్చుంటూ.

"అంతేనండీ. పట్టణంలో మధ్యనఇల్లుంటే మనకు ఒరిగిపోయిందేముంది?" అన్నాడు కోదండరామయ్య. రెండు నిముషాలు వూరుకొని ఇక అసలు వ్యవహారంలోకి దిగాడు. "మరి అయితే సంగతి..."

"రాత్రి కూర్చుని మీ జాతకం, మీ ఆవిడ జాతకం జతచేసి పరీక్షచేసి, ఆ ఇళ్ళ పరిసరాలు పోల్చి జాగ్రత్తగా పరీక్షచేశాను. అంతా పూర్తయేసరికి రాత్రి రెండు గంటలయిందనుకోండి. ఆఖరికి వెంకయ్యనాయుడుగారి యిల్లు మీకు అచ్చొస్తుందని తేల్చుకొన్నానండి." అన్నాడు దుర్గయ్య.

"అది కొంచెం ఓల్డుమోడలేమో అనిపిస్తుందండీ?"

"ఓల్డుమోడలేమిటండీ? మనం కొనుక్కుని కొన్ని మార్పులు చేసుకొంటే అదే న్యూమోడల్ అయిపోతుంది. అసలు ఇక్కడ మనపాయింటు అది కాదు కదండీ. కొత్తగా మీవాడిచేత ప్రాక్టీసు పెట్టిస్తున్నారాయె. ఇల్లు కలిసివస్తే ఇక అతడిజీవితానికి ఢోకా లేదండీ. ఒకసారి అతడిజాతకంకూడ తీసుకురాక పోయ్యారే? చూసేవాడినిగా?"

"అరెరె. మర్చిపోయ్యానండీ. సరే పోనీయండి. ఇప్పుడు మీరోకసారి రారాదూ. మాఇంట్లో వాడిజాతకం చూద్దురుగాని. అట్లాగే వెంకయ్యనాయుడుగారిల్లు ఇంకోసారి చూసిరావచ్చు."

ఇంతలో దుర్గయ్య ఆరేళ్ళకూతురు రెండు గ్లాసులతో కాఫీ తెచ్చింది. దుర్గయ్య ఓ గ్లాసు కోదండరామయ్యగారికిస్తూ "కాఫీ తీసుకోండి" అన్నాడు.

"అరెరె. ఇప్పుడే తాగివస్తున్నానండీ."

"ఫరవాలేదు తీసుకోండి. కాఫీ ఎన్నిసార్లు తాగితేనేమిటి?"

కాఫీ తాగినతరువాత కోదండరామయ్య

"ఒకసారి వెళ్ళివద్దాం లేవండి దుర్గయ్య గారూ!" అన్నాడు.

"ఇప్పుడు వేళ కాదు మంటా రా?... సరే పదండి. ఇదుగో ఇంట్లోకెళ్ళి చొక్కా వేసుకొస్తాను" అని ఇంట్లోకి వెళ్ళాడు దుర్గయ్య. "ఏమే ఎక్కడున్నావ్?" అని భార్యను కేకేశాడు.

వంటయింట్లోంచి ఆయనభార్య సీతాదేవి వచ్చింది. ఆవిడకు దాదాపు నలభై ఏళ్లుంటయ్. మొగుడికంటె కొంచెం పొడుగుంటుంది. ఆయనలాగే ఎర్రగా ఉంటుంది. కాకపోతే సన్నగా ఉంటుంది. "ఏమిటండీ?" అంటూ వచ్చింది.

దుర్గయ్య కొంచెం గొంతు తగ్గించి "కోదండరామయ్యగారు ఊళ్ళోకి రమ్మంటున్నారు. ఎటూ వెడుతున్నానుకదా, ఇంట్లోకిఏమన్నా కావాలా?"అనిఅడిగాడు.

"ఏమున్నయ్? కూరలయిపోయినయ్... ఓ అరవీశె పంచదార, ఓ శేరు గోధుమలు పట్టుకురండి."

"సరే. సంచి ఇటుతే."

"అన్నట్టు మరిచిపొయ్యాను. అమ్మాయి ఏదో పుస్తకం కొనుక్కోవాలి అయిదు రూపాయలిమ్మంది కదుటండీ."

"అవునేవ్. ఇప్పుడెట్లా మరి? నాదగ్గిర రెండో మూడో వున్నాయ్. ఇక బ్యాంకు కెళ్ళాలి .. అయినా ఎందుకు? ఇప్పుడీకోదండరామయ్య అయిదోపదో ఇస్తాడులే. వచ్చి ఇస్తాను. సరేనా?"

"అట్లాగేలెండి."

సంచీ తీసుకొని కోదండరామయ్యతో బయలుదేరాడు దుర్గయ్య. ఇద్దరూ యూనివర్సిటీదగ్గరకొచ్చి రెడీగావున్న పదో నెంబరు బస్సు ఎక్కారు. కోదండరామయ్య రెండుటిక్కట్లు కలెక్టరాఫీసుదగ్గరికి తీసుకొన్నాడు. తనకేమీ సంబంధం లేదన్నట్టు దుర్గయ్య కూర్చున్నాడు.

కోదండరామయ్య టికెట్లు తీసుకొన్న తరువాత,"వెధవది, ఇంట్లోంచిబయలుదేరితే, ఏదోవొకటి తేవలిసిఉంటుందండీ"అన్నాడు దుర్గయ్య.

"సంసారం కదుటండీ. అంతే."

"ఇదుగో ఇప్పుడు ఓ వీశె పంచదార, రెండుశేర్లు గోధుమలు తెమ్మని చెప్పారు. ఏంచేస్తాం? తప్పుతుందా?"

"దానికేముందిలెండి. మాకొట్లో తీసుకోవచ్చు. వెళ్ళగానే కుర్రాడిని పంపించి తెప్పిస్తాను. మీకు శ్రమ ఎందుకు?"

"శ్రమేముంది లెండి. ఎటూ నేను బజారుదాకా పోవాలి. తీసికెళ్ళిపోతే సరిపోతుంది. దానికోసరం మీవాడు వెళ్ళి తేవటం ఎందుకు."

"అంతేలెండి. ఇప్పుడు మా ఇంటికి వెళ్ళి మావాడి జాతకంచూసి, ఆతరువాతి నాయుడుగారిఇల్లు మీరింకోమారు చూద్దురుగాని. ఆతరువాత ఇద్దరం మాకొట్టుకెడదాం. అక్కడ మీ సామానులు తీసుకొందురు గాని."

"పోనీయండి అట్లాగే చేద్దాం."

బస్సు బయలుదేరింది.

దుర్గయ్యగారంటే, వ్యాపారస్తులలోనూ, డాక్టర్లలోనూ, ప్లీడర్లలోనూ ఇంకా చెప్పాలంటే మధ్యతరగతిలో పైతరగతివాళ్ళలో ఈయన మంచి సాముద్రికుడని పేరుంది. ఈయన భవిష్యత్తును, వ్యవహారాలలో లాభనష్టాలు, కష్టసుఖాలను ఖచ్చితంగా చెప్పగలడని నమ్మకంవున్నది...

ఇద్దరూ కలెక్టరు ఆఫీసుదగ్గర బస్సుదిగి కోదండరామయ్య ఇంటికి బయలుదేరారు. కోదండరామయ్య పెద్దబజారులో రెండు మూడురకాల వ్యాపారాలు చేస్తున్నాడు. బాగా గడించాడని పలుగురూ అనుకొంటారు. కొడుకు ఎం. బి. బి. ఎస్. ప్యాసయ్యాడు. ఇప్పుడు స్వంతంగా ప్రాక్టీసు చేయించాలని ఆయన ఆశయం. అందుకని ఒక కొత్తఇల్లు కొనుక్కుని భారీఎత్తున డిస్పెన్సరీ ఏర్పాటుచేయిస్తే కొడుకు పైకొస్తాడని ఆయన నమ్మకం. అందుచేత దుర్గయ్యను సంప్రతించి కలిసొచ్చే ఇల్లొకటి కొనుక్కోవాలని సంకల్పం. రెండు మూడు ఇళ్ళు చూశాడు. వాటిల్లో తమకు కలిసొచ్చే ఇల్లు ఇప్పుడు దుర్గయ్య నిర్ణయించాలి.

దుర్గయ్య కోదండరామయ్యకొడుకు జాతకం బహుజాగ్రత్తగా పరీక్షచేశాడు. ఈ జాతకలక్షణాలనుబట్టి, ఆ జాతకుడు అభివృద్ధిలోకి రావటానికి ఏయే లక్షణాలుగల ఇల్లు లాభిస్తుందో ఆయన తేల్చి చెప్పాలి. అరగంట క్షుణ్ణంగా పరీక్షచేసిన తరువాత దుర్గయ్య "కోదండరామయ్యగారూ ఒకసారి నాయుడుగారింటికి వెళ్లివద్దాం. ఏమంటారు?" అన్నాడు.

"అయ్యో పదండి. అంతకంటేనా?"

కోదండరామయ్య కొందామనుకుంటున్న నాయుడుగారిల్లు "డాబాగార్డెన్సు"లో వున్నది. ఇద్దరూ అక్కడికి చేరారు. అది డాబాయిల్లు. రోడ్డుమీదికే వున్నది. నాయుడుగారు రాయలసీమ వెళ్ళిపోవాలని ప్లాను వేసుకొన్నారు. అక్కడాయన కొడుకులు ఉద్యోగాలు చేస్తున్నారు. అందుకనే కొత్తగాకట్టిందే అయినా ఈడాబా అమ్మేయాలని ప్రయత్నం. దుర్గయ్య డాబా లక్షణాలను పరీక్షచేశాడు. అదో అరగంట పట్టింది.

"పదండి కోదండరామయ్యగారూ."

ఇద్దరు మళ్లీ బజారువేపు బయలుదేరారు. దారిలో దుర్గయ్య "అన్ని లక్షణాలు సరిపోయినయ్యండి. మీవాడి జాతకంలో వున్న నివాస యోగానికి ఈ ఇంటికి లక్షణాలు సరిపోయినయ్యండి. కాకపోతే మీవాడుముపై నాలుగేళ్లు వచ్చేవరకి, అంటే ఇంకో





★ ఇండియా క్యానింగ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, విజయవాడ-2

Sole Agents for Circars and Rayalaseema

M/S ఆక్మి ట్రేడ్ ఏజన్సీస్ పి. బి. నెం. 116—విజయవాడ-1.

NVKR

**PAKCO** ప్యాక్కో స్లో-స్పీడ్, కోల్డు స్టార్టింగ్ క్రూడ్ ఆయిల్ ఇంజనులు

—: ప్రత్యేక లక్షణములు :—

* పనిచేయ ప్రారంభించుట తేలిక
* తక్కువ ఇంధన ఖర్చు
* క్రమమైన నడక
* దిట్టమైన నిర్మాణం
* ఎక్కువ మన్నిక
* అద్భుతంగా పనిచేయును
* బాష్ ఫ్యూయల్, ఇంజక్షన్ పరికరములు



మద్రాసు, ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రములకు ఏజెంట్లు :

Grams: LAMP **K. S. SHIVJI & CO.** (Estd 1903)
Phone: 8617 పోస్టుబాక్స్ నెం. 5, 178-79 బ్రాడ్వే, మద్రాసు-1.

ఆయుర్వేదౌషధములు.

శాస్త్రీయముగాను, నమ్మకముగాను తయారుచేయు సంస్థ.

వేంకటేశ్వర ఆయుర్వేదనిలయం.

చింతలూరు.

ఆలమూరు పోస్టు ★ తూర్పుగోదావరిజిల్లా.

ఆంధ్రదేశమందంతటను బ్రాంచీలు. ఏజన్సీలు కలవు.

ఏజెన్సీ :-2, రతన్ బజారు, మద్రాసు-3.


పదేళ్లకు ఇంకో గృహం కట్టుకొంటాడని జాతకంలో కొట్టొచ్చినట్టు కనబడుతోందనుకోండి... అది వేరేసంగతి. ఇప్పటికిమటుకు ఈఇల్లే కొనుక్కోండి" అన్నాడుదుర్గయ్య.

"సరే, ఇంకేం మీరే నిర్ణయించారుగా. నాయుడుతో బేరం ఆడి యివ్వాళో రేపో సెటిల్ చేయించేస్తాను"

"అలాగే చేయండి. ఇక నేను వెడతానండి. బుచ్చిరాజు ప్లీడరుగారు ఒకసారి వచ్చి వెళ్లమని కబురుచేశారు."

"అదేమిటండీ, ఏవో సామానులు తీసుకోవాలనుకున్నారు? తీసుకోరా ఏమిటి? రండి మా కొట్టుకు వెడదాం."

"అవునండోయ్. ఆ సంగతే మర్చిపోయ్యాను. సరే పదండి" అంటూ దుర్గయ్య ఆయన వెనకాలే కొట్టుకు బయలుదేరాడు. కొట్టుకెళ్ళగానే కోదండరామయ్య వీశ పంచదార, రెండు శేర్లు గోధుమలు పొట్లం కట్టించి దుర్గయ్యకిచ్చాడు.

"మొత్తం ఎంతయిందండీ"

"డబ్బుకేమిటిలెండి. ఫరవాలేదు."

"అదిగో మీరెప్పుడూ అట్లాగే అంటుంటారు..."

"దానికేంలెండి. ఇదుగో తీసుకోండి..." అని కోదండరామయ్య పదిరూపాయల కాగితం ఇచ్చాడు. అది దుర్గయ్య జాతకాలు పరీక్షచేసి భవిష్యత్తు చెప్పినందుకు ఫీజు.

"ఇప్పుడెందుకండీ. గృహప్రవేశం అయిన తరువాత చూసుకోవచ్చుగా?" అన్నాడు దుర్గయ్య.

"ఫరవాలేదు ఉంచండి" అని కోదండరామయ్య ఒకవిధంగా ఆ నోటును బలవంతంగా దుర్గయ్యచేతిలో పెట్టాడు. ఇక తప్పనిసరి అయినట్టుగా ఆయన దాన్ని మడిచి జేబులో పెట్టుకొన్నాడు. "ఇక వెళ్లి వస్తానండీ."

"మంచిదండి. రేపో ఎల్లుండో ఒకసారి రండి. ఆ బేరమేమయిందో చెబుతాను."

"అయ్యో రానుటండీ. తప్పకుండా" అంటూ దుర్గయ్య బజారునుంచి మెల్లిగా ప్లీడరు బుచ్చిరాజుగారింటికొచ్చాడు. బుచ్చిరాజుగారు పార్టీలతో ఏదో సుదీర్ఘంగా మాట్లాడుతూ ఒకసారి ఇటు చూసి "అనుకున్నప్రకారం వచ్చేశారే. అటు కూర్చోండి దుర్గయ్యగారూ. ఇంకొక పావు గంటలో వచ్చేస్తాను" అన్నాడు.

గంట పది అవుతోంది...

దుర్గయ్య అక్కడే కుర్చీలో కూర్చుని పక్కనే పడివున్న పేపరు చూడటం మొదలు పెట్టాడు.

గంట పదకొండుం బావయింది. అప్పటికి బుచ్చిరాజుగారు పార్టీలను పంపించేసి ఇటొచ్చాడు. "అయ్యో చాలా సేపయిందండీ. కూర్చోపెట్టేశాను" అన్నాడు.

"ఆఁ! దానికేముందండి. ఫరవాలేదు..."

"మావాడు ఎం. కాం. చదువుతున్నాడు తెలుసుగదూ? వాడి పెళ్లి చేద్దామనుకొంటున్నానండి. ఏదో మంచి సంబంధం ఒకటి వచ్చింది. పిల్లజాతకం పంపించారు. మావాడిజాతకం, పిల్లజాతకం మీకు చూపిద్దామని పిలిపించాను. ఒకసారి చూడండి" అని బుచ్చిరాజు లేచి వెళ్లి అలమారులోంచి రెండు జాతకాలు పట్టుకొచ్చి యిచ్చాడు. "ఇద్దరి జాతకాలు సరిపోతే చేసేద్దామని చూస్తున్నానండి. పిల్ల తండ్రి గవర్నమెంటులో డిప్యూటీ సెక్రెటరీగా వుంటున్నాడు. ఈ దిక్కుమాలిన రోజుల్లో కట్నం తీసుకోవటం కూడ నేరమయిపోయింది కదుటండీ. అందుచేత కట్నంరూపేణా గాకుండా ఏదోవిధంగా ఓ పాతిక వేలు ముట్టచెబుతా నంటున్నాడు. అందుచేత జాతకాలు కలిస్తే చేసెయ్యాలని అనుకొంటున్నాను."

"అట్లాగేనండి. పరీక్షచేసి చెబుతాను." అంటూ దుర్గయ్య ఇక వెళ్ళటానికి లేచాడు.

"ఎప్పుడు చెప్పటానికి వీలవుతుంది?"

"ఎప్పుడో ఎందుకండీ. సాయంత్రం చెప్పనూ? సాయంత్రం ఏడున్నర ఆ ప్రాంతాల వస్తాను వుంటారా?"

"వుంటాను, రండి."

"మంచిది వెళ్ళొస్తానండి." అని దుర్గయ్య బయలుదేరాడు. ఆయన ఇల్లు చేరేసరికి పన్నెండున్నరయింది. ఆయనభార్య సంచీ చూసి అయ్యో కూరలేవీ తేలేదేమండి?" అని అడిగింది.

"మర్చిపోయ్యానే. అయినా కూరలు బజారునుంచి తీసుకురమ్మనకపోతే దొడ్లో నాలుగు కూరమొక్కలు పెట్టుకోరాదూ? అనవసరం డబ్బుదండుగ..."

"అవును. మీకన్నీ డబ్బుదండగలుగానే కనిపిస్తయ్. కూరలు తెస్తే డబ్బుదండుగ అనుకొంటే ఎలాగండీ?"

"అవునే. అబ్బాయి అమ్మాయి ఆ అనగ్నె పూర్తయేదాకా కొంచెం డబ్బు జాగ్రత్తగా వాడుకోవాలి. ఆతరువాత వాడే మనల్ని కూర్చోపెట్టి పోషిస్తాడు..."

"వాడిసంపాదనసరే, మీసంపాదన ఏమవుతుందండీ?"

"నా సంపాదనను నమ్ముకొంటే అయినట్టే. అంతా గాలివాటం."

ఆ మధ్యాహ్నం భోజనంచేసిన తరువాత దుర్గయ్య బుచ్చిరాజుగారిచ్చిన జాతకాలను ముందర పెట్టుకొక్కుచున్నాడు. ఆయన భార్య సీతాదేవి వంటయింట్లో పనిముగించుకొచ్చి కూర్చుంది ఆయనకు కొంచెం దూరంగా. "ఆజాతకాలు ఎవరివండీ?"

"బుచ్చిరాజు ప్లీడరుగారు కొడుక్కు పెళ్ళిచేస్తారట. ఏదోసంబంధం వచ్చింది. పిల్ల జాతకం కొడుకుజాతకం యిచ్చి చూడమన్నాడు."

"ఇద్దరి జాతకాలు సరిపోయినాయా" అని కుతూహలంతో అడిగింది సీతాదేవి.

"సరిపోయినా సరిపోకపోయినా ఇబ్బందిలేదు నన్నడిగితే. కుర్రవాడు ఎం. కాం. చదువుతున్నాడు. కాబోయే మామగారు గవర్నమెంటులో డిప్యూటీ సెక్రటరీ. ఈ పెళ్లే అయితే చదువుకాగానే మామగారే ఎక్కడో ఒకచోట గెజిటెడ్ ఆఫీసరు ఉద్యోగం ఇప్పించేస్తాడు. ఇక వాళ్ల జీవితానికి ఢోకాలేదు. అటువంటప్పుడు ఈ జాతకాలు ఎట్లావుంటే నేమిటి?"

"ఇక మీరే జాతకాలు ఎట్లావుంటే నేమిటంటే ఇక చెప్పేదేముంది? అటువంటప్పుడు ఇక మీరు చూడటం ఎందుకు? ఎవరినమ్మకాలు వాళ్ళవి."

దుర్గయ్య జవాబివ్వకుండా జాతకపరీక్షలో నిమగ్నుడయిపోయాడు.

"ఇన్నిసార్లు చెప్పినా మన అమ్మాయి, అబ్బాయి జాతకాలు చూడరుకదా? ఒకసారి చూసి చెప్పండీ"

దుర్గయ్య తలఎత్తాడు. "ఎన్నిసార్లు చెప్పానే. ఇద్దరి జాతకాలు బ్రహ్మాండంగా వున్నాయి. ఇద్దరూ మంచివుద్యోగం సంపాయించుకొంటారు. చక్కగా పెళ్లిళ్లు చేసుకొంటారు..."

"ఇదిమీకు రోజూపాఠేగా. అంతేకాని నేను అడిగానకదా కొంచెం చూసి చెప్పరు కదా?"

దుర్గయ్య కొంచెం నవ్వేసి తన పనిలో నిమగ్నుడయిపోయాడు.

సాయంత్రం అయిదు గంటలకు దుర్గయ్య బుచ్చిరాజుగారింటికని బయలుదేరాడు. ఇల్లు దాటి ఓ యాభైగజాలు వచ్చాడో లేదో, ఎదురుగా ఓ నలభైఏళ్ళ వయస్సున్నాయన ఈయనవంక రెండు మూడు సార్లు ఎగాదిగా చూసి "ఏమండి! దుర్గయ్యగారంటే మీరేనా?" అని అడిగాడు.

"అవునండీ నేనే."

"నా పేరు సత్యనారాయణండీ. కలక్టరాఫీసులో పనిచేస్తున్నాను. మీతో కొంచెం అర్జంటు పనివుండి వచ్చాను."

"ఓహో! అట్లాగా! చెప్పండి ఫరవాలేదు."

"అబ్బే ఇక్కడ కాదు. ఎటన్నా వెళ్లి ఒంటరిగా కూర్చుందాం."

"ఓ దానికేం? పదండి" అని దుర్గయ్య ఆయన్ని తన ఇంటికి తీసుకొచ్చి డాబా మీదికి తీసుకెళ్లాడు. "ఇక చెప్పండి. ఏమిటో మీపని"

"నా యిల్లు అమ్మేద్దామనుకొంటున్నానండీ. మీకు అందరూ తెలుసు. మీతో సంప్రదిస్తే పని జరుగుతుందని విన్నాను..."

"మీ ఇల్లెక్కడండీ? ఎంత ధర వస్తుందనుకొంటున్నారు?"

"మహారాణీపేటలోనండీ. ఇరవై వేలు అయినా వస్తుందనుకొంటున్నారు."

"సరే ఒకసారి వెళ్లి చూద్దామా ఏమిటి?"

"ఇప్పుడే పదండి" అని లేచాడు సత్యనారాయణ.

"చూడండి. సత్యనారాయణగారూ! ఆహార వ్యవహారాలలో మొహమాటం పనికిరాదంటారు. మీ ఇల్లు యిరవై వేలకయినా పాతిక వేలకమ్ముడుపోయినా నాకు నూటికి రూపాయి కమీషను ఇవ్వాలి. నా సాధ్యమయినంతవరకూ ఎక్కువ ధరకే అమ్ముడుపోయేటట్టు ప్రయత్నిస్తాను. ఏమంటారు? అంత్యనిష్ఠూరంకంటే ఆది నిష్ఠూరం మంచిది కదుటండీ. అందుచేత ముందుగానే చెప్పాను" అన్నాడు దుర్గయ్య.

మంచిధర వచ్చి అనుకున్న పని సవ్యంగా జరిగిపోవాలేగాని మీ కమిషన్ పువ్వుల్లో పెట్టి యివ్వనుటండీ. సరే పదండి ఒకసారి ఇల్లు చూద్దురుగాని."

సత్యనారాయణ ఖర్చుమీద ఇద్దరూ మహారాణీపేట చేరారు. ఆయన ఇంటికి చేరగానే దుర్గయ్య ముందు తన లాల్చీ జేబులోంచి 'టేపు' తీసి ఇంటి,పొడుగు వెడల్పు, స్థలం పొడుగు వెడల్పు కొల్చుకొన్నాడు. ఆ తరువాత ఇంట్లో ఎన్ని గదులున్నదీ, ఏయే సౌకర్యాలున్నదీ ఒకచిన్న నోటుపుస్తకంలో రాసుకొన్నాడు. "ఇల్లు దివ్యంగా వున్నదండీ. ఇరవై వేలు రాకపోవట మేమిటి?" అన్నాడు.


"ఏదో మీరు శ్రమతీసుకొని తప్పకుండా ఈ సహాయం చెయ్యాలి. ఈ యిల్లు అమ్మి

ఉపాధ్యాయుడు - ఒరేయ్ భగవన్నారాయణా, మనం నోటితో గాలి ఎందుకు పీల్చమో చెప్పరా!

భగవన్నారాయణ...... నోటితో పీల్చితే చాలాగాలి లోపలికి పోయి ఊపిరితిత్తులు ప్రేలి ఛస్తామండి.

పంగి (పలాసా హైస్కూల్)

బుడుగు రూ. 1-25
టామ్‌స్వాయర్ ,, 2-00
పోస్టేజి, ప్యాకింగ్ ఖర్చులు ప్రత్యేకము
ఆంధ్రగ్రంథమాల,
7, తంబు చెట్టి వీధి, మద్రాసు-1




# ఉదర పోషణార్థం

ఇద్దరు కూతుళ్ళ పెళ్లిళ్లు చేయాలని సంకల్పం. ధర వస్తుందంటారా?"

"తప్పకుండా వస్తుంది. మీకెందుకు? మీ ప్రయత్నాలమీద మీరుఉండండి. అనుకొన్న ధరకి ఇల్లు అమ్మే బాధ్యత నాది. ఆం! అన్నట్టు ఈ యింటికి సంబంధించిన డాక్యుమెంట్సు అవీ ఒకసారి చూపించండి."

సత్యనారాయణ లోపలికెళ్ళి ఆ కాగితాలు పట్టుకొచ్చాడు. దుర్గయ్య అవన్నీ ఒకసారి తిరగేశాడు. ఆ తరువాత వాటని తిరిగి ఇచ్చేస్తూ "ఇక మీరు నిశ్చింతగా వుండండీ. మీ ఏర్పాటుల్లో మీరుంటుండండి. ఇంకో వారంరోజుల్లో మీ ఇల్లు అమ్మేయొచ్చు" అని ఇక లేచాడు.

"అట్లాగేనండీ. మీ మాటమీద నమ్మకంతో ఇంకో పదిహేనురోజుల్లో ముహూర్తం ఒకటి వుంది. దానికే పెళ్ళి జరిగేటట్టు నిశ్చయించి వియ్యంకులకు వుత్తరాలు రాసేస్తాను. సరేనా?"

"ఖచ్చితంగా రాయండి. ఇక వెళ్ళొస్తానండీ. శెలవు." అని దుర్గయ్యగారు బయలుదేరబోతూ ఏదో గుర్తకొచ్చి వెనక్కి తిరిగి "సత్యనారాయణగారూ, మీరువున్నా లేకపోయినా ఈ ఇల్లు చూసుకోవటానికి ఎవరినన్నా తీసుకొచ్చి చూపించవచ్చుగా?"

"అయ్యో, మీకు అభ్యంతరమేముంటుందండీ?"

దుర్గయ్య బుచ్చిరాజుగారింటికని బయలుదేరాడు. బుచ్చిరాజుగారు ఇంట్లో లేరు. 'సరే ఇదీ ఒకందుకు మంచిదే. ఆ సత్యనారాయణ వ్యవహారం చూసుకోవచ్చు' అని మనస్సులో అనుకొంటూ తాను వచ్చి వెళ్ళానని చెప్పమని చెప్పి బయలుదేరాడు. మెల్లిగా అట్లాగే ఏదో ఆలోచిస్తూ నడుస్తూ ఒక ఫ్యాన్సీ షాపులో దూరి "నమస్కారమండీ లక్ష్మీనరసయ్యగారూ?" అన్నాడు.

ఏదో బేరం చూస్తూన్న లక్ష్మీనరసయ్య ఇటు తిరిగి చూసి "ఓహో ఇటొచ్చారేమిటండోయ్ దుర్గయ్యగారూ! కూర్చోండి" అని బేరంసంగతి చూసి ఆ తరువాత మళ్ళీ ఇటు తిరిగాడు లక్ష్మీనరసయ్య. "ఏమిటండీ విశేషాలు?"

"ఏముందండీ? ఏదో పనుండి బజారొచ్చాను. ఊరికే చూసిపోదామని ఇటొచ్చాను."

"ఓహో! ఏమిటి సంగతులు?"

"సంగతులకేమున్నయ్? ఆ మధ్య మీరు

కొంటున్నారు కదూ? ఆసంగతే చెబుదామని వచ్చాను. మహారాణిపేటలో డాబా ఒకటి అమ్మకానికొచ్చింది లెండి. మీకు ఏమయినా వీలుంటుందేమోనని అడగటానికొచ్చాను."

"ఓహో. మహారాణీపేటలోనా? ఏ మాత్రం చెబుతున్నారేమిటి?"

"ఇరవై వేలు చెబుతున్నాడండీ. సత్యనారాయణ అని ఏదో గవర్నమెంటు ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నాడుట..."

"సరేలెండి. రేపొద్దున ఒకసారి ఇల్లు చూద్దాము. మీకు వీలవుతుందా?"

"ఎందుకు వీలుకాదండీ? రేపు పదింటికి మీ షాపు దగ్గిర కొస్తాను. సరేనా?"

"అట్లాగేనండి."

మరునాడు పదిన్నరకు దుర్గయ్య లక్ష్మీనరసయ్య దుకాణం దగ్గిరకొచ్చాడు. ఆయన ఈయనకోసరమే ఎదురు చూస్తున్నాడు. ఇద్దరు కలిసి మహారాణీపేట కొచ్చారు. సత్యనారాయణ ఆఫీసుకు బయలుదేరే సమయానికి ఇద్దరు ఎదురొచ్చారు.

"రండి. రండి" అంటూ ఇద్దరిని లోపలికి తీసుకెళ్ళాడు.

"ఈయన లక్ష్మీనరసయ్యగారని, ఈ వూళ్లో వ్యాపారస్థుడు. మీ ఇల్లు ఒకసారి చూసిపోదామని వచ్చారు" అన్నాడు దుర్గయ్య.

సత్యనారాయణ ఇల్లు అంతా చూపించాడు. "ఎంత చెబుతున్నారండీ?" అని లక్ష్మీనరసయ్య అడిగాడు.

"ఇరవై వేలండీ" అని జవాబిచ్చాడు సత్యనారాయణ.

ఇల్లంతా చూడటం పూర్తయిన తరువాత దుర్గయ్య లక్ష్మీనరసయ్య మళ్లా బజారుకు బయలుదేరారు. ఇద్దరు షాపుకు చేరిన తరువాత లక్ష్మీనరసయ్య "ఇల్లు బాగుందండీ. అదీకాక మంచి 'లొకాలిటీ'లో ఉంది. కాని ధర కొంచెం ఎక్కువే" అన్నాడు.

"మంచి లొకాలిటీలో ఉందికనుకనే ధర ఎక్కువండీ."

అయిదునిముషాలు ఎవరూ మాట్లాడలేదు. తరువాత లక్ష్మీనరసయ్య "ధర ఏమయినా తగ్గితే కొనవచ్చండీ" అన్నాడు.

"ఆయన వ్యవహారం చూస్తే ధర తగ్గించే సూచనలేమీ కనబడటం లేదండీ."

"దానికేముందిలెండి. మొదట్లో అందరూ అట్లాగే అంటారు. ఏమయినా మీరు ప్రయత్నిస్తే సరి. చూడండి. ఇరవై వేలకు ఎంతతగ్గినా, ఆ తగ్గించిన ధరలో నాలుగో వంతు మీకిస్తాను. ప్రయత్నించి చూడండి."

అప్పటికి ఉదయం పదకొండున్నర దాటింది. దుర్గయ్య బయలుదేరాడు. బుచ్చిరాజుగారింట్లో కనుక్కుంటే ఆయన కోర్టుకెళ్లారని తెలిసింది. 'ఈయన్ను చూడటం పడలేదే. ఆ జాతకాలు సరిపోయినయ్యని చెబితే ఆపాతిక ఇస్తాడు. దాంతో ఇంట్లో సామానులు తేవచ్చు. లేకపోతే బ్యాంకులోంచి తీయాల్సొస్తుంది' అని అనుకొంటూ బయలుదేరాడు.

మధ్యాహ్నం దుర్గయ్య నిద్రపోతుంటే సీతాదేవి వచ్చి లేపింది. "ఏమండోయ్ లేవండీ. ఎవరో ఇద్దరు మీకోసరం వచ్చారు." అన్నది.

దుర్గయ్య లేచి దొడ్లోకివెళ్లి మొహం కడుక్కొని వరండాలోకొచ్చాడు. ఎవరో ఇద్దరు — ఒక ముసలాయనా, ఓ పాతికేళ్ళ యువకుడు-కుర్చీల్లో కూర్చొని ఉన్నారు. దుర్గయ్యను చూడగానే ఇద్దరూ లేచారు.

"కూర్చోండి. కూర్చోండి. ఫరవాలేదు. మీరు..." ఎవరన్నట్టు వారివంక చూశాడు దుర్గయ్య.

దుర్గయ్యకు యువకుడు సమాధానమిచ్చాడు. "నేను బుచ్చిరాజుగారబ్బాయినండి. ఎం. కాం. చదువుతున్నాను. ఈయన మా మేనమామ. హైస్కూల్లో టీచరు. మీతో ప్రత్యేకంగా మాట్లాడాలని వచ్చాము."

"ఓహో.అట్లాగా.సరే పైకివెడదాంరండి" అని ఇదరిని డాబాపైకి తీసికెళ్లి తనగదిలో కూర్చోపెట్టాడు. ఆయనకు ప్రత్యేకంగా డాబామీద ఒకగదివుంది. అందులో ఒక టేబులూ, నాలుగుకుర్చీలూ ఓఅలమారనిండా ఏవేవో పుస్తకాలూ - బహుశా జ్యోతిశ్శాస్త్రానికి సంబంధించినవి-వున్నయ్. గది శుభ్రంగావుంది.

"కూర్చోండి" అని ఇద్దరికి చెరొకకుర్చీ చూపించి తానొక కుర్చీలో కూర్చొని "ఏమిటండీ విశేషం?" అని ప్రశ్నించాడు.

"నువ్వే చెప్పమన్న"ట్టుగా యువకుడు మేనమామవైపు చూశాడు..

బిచ్చగాడు—ధర్మం చెయ్యండి బాబూ!

గృహయజమాని- దుక్కలాగున్నావు. పని చేసుకోలేవూ? కుంటివాడికి అయినా గుడ్డివాడికి అయినా ధర్మం చేస్తే పుణ్యం కాని నీ వంటి వాడికా? ఛో. ఛో.

బిచ్చగాడు—మీరిచ్చే పిడికెడు బియ్యానికి ఏమి పోగొట్టుకోమంటారు బాబూ?

ఆర్. వి. హరనాథ్ (వాల్తేరు)

ముసలాయన మొదలుపెట్టాడు. "బుచ్చిరాజు మా మేనత్త కొడుకండీ. మొదటినుంచీ మా యిద్దరి కుటుంబాలూ కలిసిమెలిసే వుండేవి. అందుచేతే మా అమ్మాయిని మొదటినుంచీ వీడికే ఇద్దామని వాళ్ళూ మేమూ కూడ అనుకొంటుండే వాళ్ళం. దాంతో అందరూ అదేమాట అనుకొన్నారు. ఎటుతిరిగి ఈ నాలుగేళ్ళనుంచీ ఆయన ప్రాక్టీసు బాగాపెరిగింది. అంతస్తూ పెరిగింది. దాంతో వీడూ బాగా చదువుకొంటూ ఎం. కాం. దాకా వచ్చాడు. ఇప్పుడు బుచ్చిరాజుకు నేనన్నా మా అమ్మాయన్నా అంత ఇష్టంలేదు. నేనే రెండు మూడు సార్లు పెళ్ళిసంగతి కదిలిస్తే దాటేస్తూ వచ్చాడు. మొన్న నొకసారి గట్టిగా అడిగితే మా సంబంధం ఒకటేనా ప్రపంచంలో ఉన్నది? కావాలంటే ఇంకో సంబంధం చూసుకో ' అని చెప్పాడు. మొదటినుంచీ మేనరికమని అందరికీ తెలుసు. అటువంటప్పుడు పైవాళ్ళు ఎవరొస్తారు చెప్పండి. ఒకవేళ ప్రయత్నించినా పిల్లలో ఏదో లోపం వుందంటారు. అసలు సంగతి అది కాదు. వీడు అదీ మొదటినుంచీ ఎంతో 'ఇది'గా ఉన్నారు. ఆ సంగతి అందరికీ తెలుసు. వీడికి ఇంకో సంబంధం చూశారనీ, ఆ అమ్మాయి జాతకంకూడా మీకు ఇచ్చారని మా అమ్మాయికి తెలిసి నాదగ్గిరకొచ్చి చెప్పి కంట తడిపెట్టింది. వీడు సరే సరి ఇవ్వాళ నన్ను మీదగ్గిరికి తీసుకొచ్చాడు."

"అది సరే, ఇప్పుడు నన్నేం చెయమంటారు?" అని అడిగాడు దుర్గయ్య..

"ఏం చేయమంటానండి. ఇద్దరి జీవితాలు అధోగతి కాకుండా రక్షించమంటాను. బుచ్చిరాజుకు జాతకాలంటే, పిచ్చినమ్మకం. అందులో ఆయనకు మీ మాట అంటే గురి. అంతపెద్ద ప్లీడరుకు ఈ జాతకాలంటే ఎందుకింత గురివుందా అని అందరికీ ఆశ్చర్యం వేస్తుంది. ఆ సంగతి మీకు తెలియనిది కాదనుకోండి... ఇప్పుడు ఆ సంబంధం పిల్లజాతకం వీడి జాతకానికి పొత్తు కుదరలేదని ఆ సంబంధం తప్పిపోయేటట్టు చేసి ఎలాగయినా మా పిల్లకూ వీడికి..."

"రామరామ! నమ్మినవాళ్ళకు అన్యాయం చేయమంటారుటండీ?"

"మీరు అట్లాగంటే భావ్యం కాదు. మిమ్మల్ని ప్రాధేయపడుతున్నాను. ఇందులో ఎవరికీ అన్యాయం కాదు. ఆ డిప్యూటీ సెక్రెటరీగారు తల్చుకొంటే ఇంతకంటే మంచిసంబంధం తెచ్చుకోగలరు. ఇక మా అమ్మాయి, వీడు మేనత్త మేనమామ బిడ్డలు. మొదటినుంచీ ఎంత అన్యోన్యంగా వుంటున్నారు. ఇటు వీళ్ళు సుఖపడతారు. వీడు ఎటూ ఎం. కాం. ప్యాసవుతాడు గనక మంచి ఉద్యోగం రిక

కుంచెమైనా లేకుండానే వస్తుంది. మీకు ఈ సహాయం చేయక తప్పదు. మీ ఋణం ఉంచుకోను."

దుర్గయ్య ఓ పదినిముషాలుసేపు ఆలోచించాడు. "ఏమిటో నా మనస్సు ఒప్పుకోవటం లేదండీ" అన్నాడు.

"అబ్బెబ్బె మీరట్లా అనరాదు. అన్నీ బాగా ఆలోచించి చూడండి. ఇందులో మీరు ఎవరికీ అపకారం చేయటంలేదు. అందరికీ వుపకారమే చేస్తున్నారు. విడిపోవటానికి సిద్ధంగావున్న రెండు కుటుంబాలను కలుపుతున్నారు. అన్యోన్యంగా వుంటున్న ఇద్దరి జీవితాలను శాశ్వతంగా ముడివేసి వాళ్ళకు ఎంతో ఉపకారం చేస్తున్నారు. ఇక బుచ్చిరాజును కొంచెం మోసంచేస్తున్నారు. అదయినా అతనికి ఈ మధ్యే డబ్బురాబడి కొంచెం ఎక్కువై కళ్ళ దృష్టి కొంచెం వక్రించింది. మనం అనుకున్నట్లు జరిగితే డబ్బుకంటే ఆత్మీయత ఎంత విలువైందో తెలుసుకొంటాడు."

దుర్గయ్య ఓ పావుగంట సుదీర్ఘంగా ఆలోచించాడు. తరువాత "సరే కానివ్వండి. ఒకసారి మీరిలా రండి" అని ముసలాయన్ను పక్కకు తీసుకెళ్ళాడు. తీసుకెళ్ళి ఏవో ఓ పది నిముషాలు మాట్లాడాడు. ఆఖరికి ముసలాయన జేబులోంచి అయిదు పదులుతీసి మెల్లిగాదుర్గయ్యకు అందించాడు. దుర్గయ్య అందుకొని జేబులో పెట్టుకున్నాడు. మళ్లా ఇద్దరూ తిరిగొచ్చారు. దుర్గయ్య "సరే. నా చేతనయినంత వరకు ప్రయత్నిస్తాను" అన్నాడు.

"మీరు అమాత్రం మాట ఇస్తే చాలు. మాకు ధైర్యంగా వుంటుంది. ఇక వెళ్లివస్తామండీ"

"ఆఁ! అన్నట్టు రేపో ఎల్లుండో మీరు బుచ్చిరాజుగారి దగ్గరికెళ్ళి మీ అమ్మాయిని ఇవ్వాలనుకొంటున్నట్టు, కట్నం శక్తి వంచనలేకుండా ఇవ్వదల్చుకొన్నట్టూ చెప్పండి. మీ అమ్మాయి జాతకం వుంది కదూ? ఆయన అడిగితే అదీ ఇవ్వండి..."

"అట్లాగేనండి. శలవు."

"వెళ్ళొస్తానండి. చాలా థ్యాంక్స్" అని యువకుడు అన్నాడు.

"పది నిముషాలు ఉండరాదూ? కాఫీ తాగి పోవచ్చు" అన్నాడు దుర్గయ్య.

"అక్కర్లే ఎందుకండీ! దారిలో ఎక్కడైనా తాగేస్తాం, ఫరవాలేదు" అని ఇద్దరు బయలుదేరారు.

వాళ్ళు వెళ్ళినతరువాత దుర్గయ్య జేబులో నోట్లను తడిమిచూసుకొంటూ "మనకత్తికి ఎప్పుడూ రెండువేపులా పదునే" అని మనస్సులో అనుకొంటూ కింది కొచ్చాడు. తరువాత అరగంటలో తయారయిపోయి బుచ్చిరాజుగారి దగ్గరికి బయలుదేరాడు. దారిలో ఆయనకు ఇంకో అయిడియా

# ఉదర పోషణార్థం

ఏదో తట్టింది. కలక్టరు ఆఫీసు దగ్గిర బస్సు దిగి ఒక ఇంటి దగ్గరకొచ్చి "వెంకట్రావు గారూ?" అని కేకేశాడు.

వెంకట్రావు బయటికొచ్చాడు.

"ఇప్పుడే ఇంటికొచ్చారా? ఏమిటి?"

"లేదండీ. చాలాసేపయింది వచ్చి. పేపరు చూస్తూ కూర్చున్నాను. ఏమిటి సంగతులు."

"ఏం లేదండి. మాబంధు వొకాయన ఇల్లు కొనుక్కుందా మనుకొంటున్నాడు. దగ్గరలోనే కలక్టరాఫీసులో సత్యనారాయణ గారని, ఆయనిల్లు అమ్మకాని కొచ్చిందట. ఒకసారి చూసివద్దాం వస్తారేమోనని పిల్చాను."

"ఆయన ఈపాటికింటికొచ్చివుంటాడా?"

"ఎవరు? సత్యనారాయణగారా? రాష్ట్రప్రభుత్వంలో ఉద్యోగంచేసేవాళ్ళు ఐదున్నరకు యింటికి రావడం ఎక్కడయినా ఉందా? ఆయన రాకపోయినా మనం చూడొచ్చు పదండి."

ఇద్దరూ సత్యనారాయణయింటి కొచ్చారు. ఆయన ఇంకా ఇంటికి రాలేదు. దుర్గయ్య చొరవగా లోపలికెళ్ళి ఇంటావిడతో "నన్ను దుర్గయ్య అంటారండి. ఒకసారి ఇల్లు చూడాలని..." అన్నాడు.

ఆవిడ అర్థంచేసుకొన్నది. "అట్లాగేనండి. చూసుకోండి" అన్నది.

ఇద్దరూ ఇంటిచుట్టూ ఒకసారి తిరిగి బయటికొచ్చారు. దారిలో దుర్గయ్య ఇల్లు ఎట్లా ఉందండీ. ఇరవై చెబుతున్నాట" అన్నాడు.

"ఇంటికేమండీ. బ్రహ్మాండంగా ఉంది. ఇరవై కాకపోయినా ఒకటో రెండో



చిత్రకారుడు : ఎగ్గోని శ్యామసుందర్ (గుత్తి)

[illegible] తగ్గొచ్చు" అన్నాడు వెంకట్రావు.

వెంకట్రావును ఇంటి దగ్గర దింపి దుర్గయ్య బుచ్చిరాజుగారింటికి బయలుదేరాడు. బుచ్చిరాజు కోర్టునించి వచ్చి కాఫీ అదీ పూర్తిచేసుకొని ఆఫీసు గదిలో కూర్చుని తీరికగా పేపరు చదువుతున్నారు. ఆయన దుర్గయ్యను చూడగానే పేపరు మడిచి టేబులుమీద పారేసి "రండి. దుర్గయ్యగారు. అసలు కన్పించటమే మానేశారు" అని ఆహ్వానించాడు.

దుర్గయ్య కుర్చీలో కూర్చుంటూ "మొన్నొకసారి రెండుసార్లు వచ్చానండి. మీరు లేరు." అన్నాడు.

"ఓహో! మరి మనవిషయం ఏమయ్యింది."

"అదేనండి. ఆ సంగతి చెప్పటానికే వచ్చాను." అని దుర్గయ్య, జేబులోంచి రెండు జాతకాలూ తీశాడు.

"జాతకాలు అతికినయ్యంటారా?"

"అదే చెబుతుంటినికదండీ... నా ఉద్దేశ్యంప్రకారం" రవి కాంచనిచో కవిగాంచున్,' అని పెద్దలన్నారుగాని అసలు 'కవి కాంచనిదియు జోస్యుడుగాంచున్' అనికూడ అని వుండాల్సింది, ఏమంటారు?"

"బాగా చెప్పారు. నా నమ్మకమూ అదేసుమండి"

"అటువంటప్పుడు" తెలిసింది చెప్పు, అప్రీతికరమయినా సరే స్పష్టంగా చెప్పాలనే నామతం...అది మంచిదేనంటారా?"

"మంచిదేనండి. చెప్పండి" కొంచెం అనుమానంతో అన్నాడు బుచ్చిరాజు.

"చూడండీ, ఈ అమ్మాయిజాతకం అబ్బాయికి అతకలేదు. ఈ జాతకులిద్దరూ కలిస్తే జీవితం ఇద్దరికి సుఖంగా వుండదేమో అనిపిస్తుంది. అదీకాక ఆ అమ్మాయి జాతకం బట్టిచూస్తే ఆమె జీవితంలో అంత వున్నతస్థానానికి పోయేటట్టు ఏమీ కనిపించటంలేదు...పోనీ ఎలాగో సర్దుకుపోదాం, నిజంగా అదృష్టమేవుంటే ఇవన్నీ అడ్డం వస్తాయా అనుకొంటే, ఆతరువాత మీ ఇష్టం. ఏదో ఇంతో అంతో తెలుసును కనక, మీకు నామీదఉన్న నమ్మకాన్నిబట్టి, చెప్పాను. తరువాత మీ ఇష్టం"

బుచ్చిరాజు ఆలోచనలో పడ్డాడు...

పది నిముషాలయినతరువాత దుర్గయ్య "ఇంకోగమ్మత్తుందండోయ్. మీవాడి జాతకంలో ఇదివరకేరక్త సంబంధంఉన్న స్త్రీని-అంటే చుట్టాలమ్మాయిని - పెళ్ళాడే యోగంఉన్నట్టు అనిపిస్తోంది. అదీకాక పెళ్ళయినతరువాత స్త్రీజాతకంలో దుష్టశక్తులు అడ్డుపడకపోతే మీవాడి జాతకం చాలాగొప్పది. ఎంతో ఉన్నత స్థాయికి వెళ్లే సూచనలు కొట్టొచ్చినట్టు కనబడు

(54వ పేజీ చూడండి)

# ఉదర పోషణార్థం

(23-వ పేజీ తరువాయి)

తున్నయ్. పోనీయండి, మీ చుట్టాల్లో మీవాడికి ఈడయిన పిల్ల ఎవరూ లేరుటండీ?" అన్నాడు.

పావుగంటదాకా బుచ్చిరాజు సమాధానం ఏమీ చెప్పలేదు. ఆలోచిస్తూనే ఉన్నాడు. అకస్మాత్తుగా లేచి బీరువా తీసి ఏదో వెతుకుతున్నాడు.

"ఏమిటండి వెతుకుతున్నారు?"

"మా మేనమామ కొడుకు ఒకాయన స్కూలు టీచరు ఉన్నాడు లెండి. వాడికో కూతురుంది. దాని జాతకం ఎక్కడో ఉండాలి. కనబడుతుం దేమోనని" అని బుచ్చిరాజు ఇంకో అయిదు నిముషాలు వెతికి ఓ పుస్తకం తీశాడు. అందులో చాలమంది జాతకచక్రాలు వేసిఉన్నాయ్. అందులో తనక్కావలసింది వెతికిపట్టుకొన్నాడు. "ఇదిగో ఈ జాతకం, మావాడి జాతకం కలుస్తుందేమో చూడండి. పోనీ" అని దుర్గయ్య కిచ్చాడు పుస్తకాన్ని.

దుర్గయ్య రెండుజాతకాలనూ ఇంకో అరగంట పరీక్షించాడు. ఆఖరికి "ఫస్టుగా సరిపోతున్నయ్యండి. ఈ జాతకం నాకు మీరు మొదటే ఎందుకివ్వలేదు. ఇంత ఖచ్చితంగా అతికిపోయ్యే జాతకాలు చాలా అరుదుగా వుంటాయి. ఓహో!...నన్నడిగితే మటుకు ఈ ఇద్దరికి చేసేస్తే బాగుంటుంది. బహుశా వారి అంతస్తూ అదీ మీకు తగక పోవచ్చు. అదీ ఆలోచించాల్సిందేననుకోండి. కయ్యమయినా, వియ్యమయినా సమానమయినవాళ్ళతోనే చేయమన్నారు. మీ ఇష్టం" అన్నాడు.

బుచ్చిరాజు అయిదునిమిషాలు ఆలోచించి "అంతస్తులకేమిటిలెండి. వాడు స్వయానా మేనమామకొడుకు. అసలు అదిచిన్నప్పటి నుంచీ ఇక్కడే పెరిగింది. మీ ఆశీర్వాద బలంవల్ల వాడూ అది సుఖంగా వుండటమే నాకు కావాల్సింది. సరే కానీయండి. మీ చేతే జరుగుతుంది. జాతకాలు అంతగా అతికినప్పుడు పరాయిసంబంధం చూడటం నాకు ఇష్టంలేదు." అన్నాడు.

"నా ఉద్దేశ్యము అదేనండి. మరి వెళ్ళొస్తాను" అని లేచాడు దుర్గయ్య. బుచ్చిరాజు డ్రాయరులోంచి రెండుపదులు ఒకఅయిదూ తీసి దుర్గయ్య చేతిలో పెట్టి "ఉంచండి" అన్నాడు.

"ఇప్పుడే తొందరేముందండీ. పెళ్లి అయిపోయినతరువాత చూసుకోవచ్చుగా."

"ఫరవాలేదులెండి".

మరునాడు దుర్గయ్య ఉదయం పూజచేసుకొంటుండగానే సత్యనారాయణ వచ్చాడు. పూజ కాగానే బయటికొచ్చాడు "ఏమండోయ్ పొద్దున్నే వచ్చారే" అన్నాడు.

"అవునండి. నిన్నే వియ్యంకులకు ముహూర్తంనిశ్చయించి ఉత్తరాలురాశాను. ఇంకో పదిహేనురోజులుంది పెళ్లి. పదిహేనురోజుల్లో ఇది సెటిల్ అవదుటండీ. మావాళ్లు డబ్బు చేతికిరానీయండీ చూసుకోవచ్చు అన్నారు. కాని ఈ ముహూర్తం దాటితే మళ్ళీ మంచిముహూర్తం లేదండి. అదీ కాక నాకు మీ మీద నమ్మకం ఉంది. నిన్న సాయంత్రంకూడా ఎవరినో తీసుకొచ్చారుట..."

"రాకేంచేస్తారండీ? మీ ఇల్లు ఫస్టుక్లాసు 'లొకాలిటీ'లో ఉంది. ఎగరేసుకుపోతారు. కాకపోతే ఒక సంగతండీ ఈమధ్య ఇళ్ళ ధరలు మరీ పడిపోతున్నాయండీ. నిన్న పొద్దున్నొచ్చినాయన పధ్నాలుగు వేల కడిగాడు. నిన్న సాయంత మొచ్చినాయన పద్దెనిమిది కడిగాడు. అట్లా వుంటూయి బేరాలు. అయినా ఒకటి చెప్పండి. వెయ్యి, పదిహేనొందలు తగ్గినా మీకేమన్నా అభ్యంతరమా?"

"అయ్యో అదేమిటండీ. ఇరవై వేలుకూడా రాదా? అసలు మావాళ్లంతా పాతిక వేలకు తక్కువయితే పనికిరాదంటున్నారు" అన్నాడు సత్యనారాయణ దిగాలుపడి.

"సరే ఇక నేను చెప్పేదేముంది. మీకు ఎంతధర ఎక్కువొస్తే నాకంత కమిషన్ ఎక్కువొస్తుంది కదండీ నాకు లాభమేగా. నాశక్తివంచన లేకుండా ప్రయత్నంచేస్తాను"

"అట్లాగే కానివ్వండి కాని కొంచెం తొందరగా సెటిల్ చేయండి. ఇంకా నేను ఎన్నో ప్రయత్నాలు చేసుకోవాలి."

"ఎక్కడయినా కొంచెం అప్పుచేసి మీ ప్రయత్నాలు మీరు చేసుకోండి. అంతేకాని దీనికోసరం కాచుక్కూచుంటారా"

"అప్పే ఎటూ అపనే చేస్తాననుకోండి. అయినా పెళ్ళి సమయానికైనా ఆ డబ్బు రాకపోతే కట్నాలు అవీ ఇవ్వటం ఎలా?"

"అబ్బో. లగ్నంనాటికాదా? తేలిగ్గా లే సెటిలవుతుంది. కాకపోతే చెప్పాగా. వెయ్యి పదిహేనొందలు అటూ ఇటూ అయితే మీరు వెనకాడకూడదు మరి"

"సరే అట్లాగే కానివ్వండి".

నాలుగురోజులు గడిచినయ్. ఈ నాలుగు రోజుల్లోను దుర్గయ్య వెంకట్రావులాంటి వాళ్ళను ఎవళ్ళో ఒకళ్లను తీసుకొచ్చి, సత్యనారాయణ ఆఫీసుకెళ్లినప్పుడు చూపించేవాడు. సత్యనారాయణకు ముహూర్తం దగ్గిర పడుతున్న కొద్దీ ఆదుర్దా ఎక్కువైంది. దుర్గయ్యనడిగితే "నెమ్మదిరోజులండీ. ఇప్పుడు ఇళ్లకు మార్కెటు ఆట్టేలేదు. ఏంచేయను? కేవలం మీ పనిమీదే తిరుగుతున్నాను. ప్రతివాళ్లు పదిహేనుకిస్తారా, పధ్నాలుగుకిస్తారా అని అడగటమే" అనేవాడు.

సత్యనారాయణ ఇల్లు అమ్ముతాడని నలుగురికి తెలిసింది. దుర్గయ్యతో సంబంధం లేకుండా ఓ షావుకారు వచ్చి ఇల్లు చూశాడు. ఆ సంగతి సత్యనారాయణ అమాయకంగా దుర్గయ్యతో అనేశాడు. దుర్గయ్య ఆ షావుకారు గుమాస్తాతో కావాలనే ఏదో మాటల సందర్భంలో "మీ షావుకారు ఆ సత్యనారాయ ఇల్లు కొనాలనుకొంటున్నాడేమిటోయ్. ఆయనకు చీకూ చింతా లేకుండా ఉండటం ఇష్టంలేదేమిటి? ఆ ఇల్లు అసలే తగాదాల్లో వుంది. అటువంటిది మీ షావుకారు కొందురోయ్" అన్నాడు.

అంతే! ఆ షావుకారు ఆ ఇల్లుకొనే అభిప్రాయం మార్చుకొన్నాడు. అప్పటినుంచి దుర్గయ్య కొంచెం జాగ్రత్తలో ఉన్నాడు...

ఇంకో నాలుగు రోజులు గడిచినయ్...

సత్యనారాయణ దుర్గయ్యతో "ఏమిటండీ. కొంపదీసి పెళ్లిళ్ళు ఆగిపోవుకదా? నాకేమిటో భయంగా వుందండీ." అన్నాడు ఆదుర్దాతో.

"నేను ఇంత 'డల్ మార్కెట్టు' ఎప్పుడూ చూడలేదండీ. అదేంఖర్మో ఎవరూ గట్టిగా ముందుకు రావటంలేదు. ఆ మొదట చూసిన ఒకాయనమటుకు పదిహేను వేలమీద ఖచ్చితంగా నిలబడ్డాడు" అన్నాడు దుర్గయ్య.

"పదిహేను వేలా!...పోనీ ఇంకో రెండు మూడు వేలయినా పెరిగేటట్టు చూడండీ"

ఇంకో రెండు రోజులు గడిచినయ్...

ముహూర్తం దగ్గిరపడింది. పెళ్లి ఏర్పాట్లు అన్నీ యథావిధిగా హడావిడిగా జరుగుతున్నయ్. సత్యనారాయణకు దిగులు పట్టుకుంది. ఆ కట్నం డబ్బు పదివేలూ లేకపోతే ఈ పెళ్లిళ్ళు జరగవు. ఈ ఇల్లు అమ్మకపోతే డబ్బు జతపడదు. ఎట్లాగా? "ఏమండీ దుర్గయ్యగారు చివరికి ఈ పెళ్లిళ్ళు జరిగేటట్టుగాలేవే" అని ఒకరోజు దుర్గయ్య ఇంటికెళ్లి ఆదుర్దాతో అడిగాడు. ఆయనముఖంలో

---

ఒకరు— మా అబ్బాయిని పిచ్చికుక్క కరిచింది. ఏం చేయమంటావోయ్?

మరొకడు-దానికేముంది? ఆ పిచ్చికుక్కను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి జబ్బు నయంచేయించు. మళ్లీ కరవదు.

బి. మనమోహన్ (సికిందరాబాద్)

---

అదుర్దా భయం స్పష్టంగా చూశాడు దుర్గయ్య.

"ఇట్లా అవుతుందని ఎన్నడూ అనుకోలే దండి. ఇంత ధరలు పడిపోతాయని తెలిస్తే అసలు మీకు మాట ఇచ్చేవాడినే కాదు. అసలు ఎవరూ ముందుకు రాందే? అదేం ఖర్మో! మొదట్లో ఇల్లు చూశాకే ఆయన చేత పదహారువేలకు ఒప్పించేసరికి తాతలు దిగొచ్చారు. ఆ సంగతి మీకు చెప్పాలంటే మనస్సు ఒప్పటంలేదు"

సత్యనారాయణ ఆలోచనలో పడ్డాడు. పావుగంట ఆలోచించి "అంతే నంటారా? అంతకంటే ధరరాదా?" అన్నాడు దిగులుగా.

"నే నేం చెప్పను చెప్పండి. అసలు మనం ఇల్లు అమ్ముతున్నామంటేనే లోకువ. ఆ తరువాత మీ ఇష్టం."

పావుగంట తరువాత సత్యనారాయణ "సరే కానీయండి. ఆ పదహారు వేలకే సెటిల్ చెయ్యండి..."

దుర్గయ్యకి ఆ రెండు చేతులా పడుతోంది. రెండురోజుల తరువాత యిల్లు అమ్మటం పూర్తయింది. సత్యనారాయణ దుర్గయ్యకు కమిషన్ మాట అటుంచి రూపాయలు ఇచ్చాడు. లక్ష్మీనరసయ్య అనుకొన్న ప్రకారం తగినధరలో అంటే నాలుగు వేలల్లో నాలుగో వంతు వెయ్యి రూపాయలూ ఇచ్చుకొన్నాడు. ఆయన ఉద్దేశ్యంలో అసలా ఇల్లు పాతిక వేలు చేస్తుంది మరి!....

*    *    *

ఆరోజు మ్యునిసిపల్ స్టేడియంలో దుర్గయ్యకు సన్మానం ఏర్పాటు చేశారు. ఆ సభకు బుచ్చిరాజు గారు అధ్యక్షత వహిస్తారు. ఆ సభలోనే దుర్గయ్యకు "జ్యోతిష్య శాస్త్ర జ్యోతి" అని బిరుదు ఇవ్వాలనే నిర్ణయం జరిగింది.

సాయంత్రం అయిదుగంటలకు సభ మొదలయింది. వక్తలందరూ దుర్గయ్యగారి ప్రతిభను పొగిడారు. చాలామంది వర్తక ప్రముఖులూ, పెద్దలూ అధికారులూ వచ్చారు. బిరుద ప్రదానంకూడ జరిగింది.


దుర్గయ్య ఇంటికి వచ్చేసరికి రాత్రి తొమ్మిదయింది. ఆయనకు సంతోషంతో కళ్ళవెంట ధారాపాతంగా కారిన ఆనంద బాష్పాలు మరకలు ఇంకా చెరగనేలేదు.

ఇంటికి వచ్చేసరికి కూతురు తనగదిలో కూర్చుని చదువుకొంటోంది. చిన్నపిల్లలిద్దరిని దగ్గర కూర్చో పెట్టుకొని సీతాజీవి చదువు చెబుతోంది. పెద్దకొడుకు మాధవరావు కనబడలేదు.

"మాధవ ఏడీ?" అని అడిగాడు దుర్గయ్య భార్యని, చేతిలో పూలదండలూ అవీ అక్కడ పెడుతూ.

"సభ బాగా జరిగిందిటగా. ఉండండి. దిష్టి తీస్తాను." అని ఆమె లోపలికెళ్ళి వచ్చి దిష్టితీసింది.

"మాధవ ఇంకా ఇంటికి రాలేదా?"



చిత్రకారుడు : చి త్రయ్య సూర్యనారాయణరావు (మచిలీపట్టణము)

సభకు వచ్చాడుట. మీకు జరిగిన గౌరవం చూశాట. ఇంటికొచ్చి 'ఈ చదువులు ఎందుకమ్మ? నాన్నకు ఇవ్వాళ జరిగిన గౌరవం ఈ చదువులవల్ల నాకు ఎన్నడయినా కలుగుతుందా? ఆయన సంపాయించినంత ఈ చదువులు నాకు సంపాయించి పెడతాయా' అని మీ గదిలో కెళ్ళి కూర్చున్నాడు..."

"సరిపోయింది..." అనుకొంటూ దుర్గయ్య గబగబా మెట్లు ఎక్కి పైకెళ్ళాడు. అక్కడ మాధవరావు ఈయన అల్మారులోంచి తీసిన పుస్తకం దీక్షగా చదువుతున్నాడు.

"ఇదేంపనిరా? పిచ్చివాడా. నీ క్లాసు పుస్తకాలు చదువుకోరాదూ?" అని అడిగాడు కొడుకుని.

మాధవరావు జవాబు చెప్పలేదు...

"చెప్పవేంరా? అసలు నా పుస్తకాలతో నీకేంపని?"

"నే నొకమాట చెబుతా వినండి నాన్నా. ఇవ్వాళ స్టేడియంలో మీ సన్మానసభ చూశాను. నిజంగా నాకు ఎంత గర్వం కలిగిందో. ఈ చదువులవల్ల నాకు అంత గౌరవం కలుగుతుందని అనుకోను. ఈ చదువులవల్ల మీ అంత సంపాయిస్తానని అనుకోను. అటువంటప్పుడు ఈ చదువులకోసరం అంత శ్రమపడటం కంటే అంతకంటే ఉత్తమమయిన దానికోసరం ఎందుకు ప్రయత్నించకూడదు?"

"అదన్న మాట నీ బి. ఎ. అవర్డ్ తెలిసింది! నాలాగే ఎంతమంది జ్యోతిష్యులు తిండికి నోచక గడగడలాడి పోతున్నారో చూశావా? నేను ఇంత పెద్దవాన్నయ్యానంటే నా అదృష్టం. అంతే. మిగతావాళ్ళలో ఒకరి పాండిత్యం నాలో ఏమీలేదు. అంతా కలిసి రావాలి...."

"అంతా అదృష్టంతో వస్తుంది. ఇదంతా మీ అమ్మనాన్నగారు పెట్టినభిక్ష. ఆయనే ఎందుకూ పనికిరాని నన్ను చేరదీసి ఇది నేర్పారు. మొదట్లో కొన్ని కొన్ని కేసులు నాకు అప్పచెప్పేవారు. నా అదృష్టం బాగుండి కొన్ని నే చెప్పినట్లే అయినయ్. దాంతో నాకు కొంత పేరు వచ్చింది. పెద్దవాళ్ళ ప్రాపకం దొరికింది. అంతే. అదే నా దురదృష్టంవల్ల నేను మొదట్లో చెప్పినవి నాలుగైదు చెడిపోయినట్లే ఇక నేను ఎక్కడ ఉండేవాడినో. అంతే నాయనా. ఇవ్వాళ ఇంత సన్మానం చేశారా. రేపు నాకు మలిగా చెడుపేరు రావటం మొదలుపెడితే ఎక్కడుంటానో? ఆ తరువాత నా మొగం చూసేవాళ్ళు లేరు. ఇంకా, ఇందులో తెలిసి కొన్ని అబద్ధాలు ఆడి కొందరి మెప్పుకోసరం, తక్కువవాళ్ళను అన్యాయం చేయవలసివస్తుంది. తప్పదు మరి. అంతా ఈ పొట్టకోసరం. అదీకాక నేను ఈ ఒక్క జ్యోతిష్యంవల్లే మిమ్మల్ని ఇంతవాళ్ళను చేశాననుకొన్నావా? ఇవన్నీ నీకు చెప్పరాదు. ఎప్పటికయినా మనల్ని శాశ్వతంగా నిల్పేంతటువంటి చేసేది విద్య ఒకటే. ఇవన్ని గాలివాటం. నీవు ముందు బి. ఎ. అవర్డ్ పూర్తిచేసి నాలుగురాళ్ళు సంపాయించి మమ్మల్ని ఉద్ధరిస్తావని ఆశ. ఇక నువ్వే ఇట్లాగయితే, ఇక చెప్పేదేముంది?..."

మాధవ వింటున్నాడు.

"ఆలోచించు. నీకు స్వంతంగా ఆలోచించే శక్తి ఉంది. ఆ చదువులో ఉండే ఈ మాటెప్పుడూ భరిస్తాయి. అంతేకాని ఇటువంటి శాస్త్రకారాలు పెట్టుకొంటే ఇంటికి తెచ్చేదేమీ లేదు. నీ ఇష్టం...."

మాధవరావు పుస్తకం అక్కడ వదిలి మెల్లగా లేచాడు. అతని మనస్సులో కొత్త ఆలోచనలేవో కదులుతున్నాయి.